క్లుప్తంగా...

బ్రోచర్ ఆవిష్కరణ



గోల్కొండ: అత్యాధునిక పరికరాలు, సుశిక్షితులైన సిబ్బందితో ఎసెన్షియా సెలూన్ లాంజ్‌ను ప్రారంభిస్తున్నామని టెలివిజన్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షులు, నంది అవార్డు గ్రహీత, నిర్మాత, దర్శకుడు మహ్మద్ షరీఫ్ అన్నారు. బుధవారం ఆయన అత్తాపూర్‌లో ఈనెల 16న ప్రారంభం కానున్న ఎసెన్షియా సెలూన్ లాంజ్ ప్రమోషనల్ వీడియో ఫిల్మ్, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరవాసులకు సెలూన్ రంగంలో సరికొత్త అనుభూతితో పాటు అనుభవాన్ని అందించడానికి ఈ లాంజ్ కృషి చేస్తుందన్నారు. చర్మ సౌందర్యం ఇనుమడించేలా చేయడం ఈ లాంజ్ ప్రత్యేకత అని ఆయన అన్నారు. జుట్టుకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు, అందించే చికిత్స విధానాలు అందుబాటులో ఉంటాయని ఆయన అన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి అందిస్తాం



లంగర్‌హౌస్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న చంటిబాబు, అధికారులు

లంగర్‌హౌస్: 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించే అర్హులందరికీ గృహజ్యోతి పథకాన్ని అందింపజేస్తామని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు కె.చంటిబాబు అన్నారు. లంగర్‌హౌస్‌లో గృహజ్యోతి పథకం కోసం వివిధ ప్రాంతాల్లో అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. రెండు రోజుల్లో దాదాపు 900 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు శ్రీనివాస్, దయానంద్, రవీందర్, శ్రీకాంత్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించి, అనుమానాలు నివృత్తి చేస్తూ ప్రజలకు సహాయపడ్డారు.

సంతోష్‌నగర్ డీసీగా శివకుమార్

యాకుత్‌పురా: జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్–07 సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా శివకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ డీసీగా విధులు నిర్వహిస్తున్న నాగమణి బదిలీ కావడంతో ఆమె స్థానంలో జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ అడ్మిన్ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌ను నియమించారు.

గోవుల సంరక్షణ అందరి బాధ్యత



దర్శకుడు గోపాలకృష్ణను సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్.గోపాల కృష్ణ దర్శకత్వం వహించిన గోగీతా లఘుచిత్రం ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ.. గోవులను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గోవు ప్రాముఖ్యత, ఉపయోగాలను తెలుపుతూ ఒక చిత్రాన్ని నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం దర్శకుడు గోపాలకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు రోజారమణి, కవిత, రచయిత ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తిరుమల బ్యాంక్ చైర్మన్ ఎస్.చంద్రశేఖర్, మానస ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షులు రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్‌కు చెందిన నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు వైజాగ్‌లో జరిగిన షోటోఖాన్ నేషనల్ ఓపెన్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో సత్తాచాటారు. కటా సిల్వర్, బ్రోన్స్‌లో మీనాక్షి, అనీష్ గోల్డ్, వినాయక దేవ కటా బ్రోన్స్, సాహితీ, శశాంక్, లావణ్య, అగస్త్య, స్నేహ, శృతిక తదితరులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. వీరిని కరాటే మాస్టర్ గణేష్ నాయక్ బుధవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..స్వీయ రక్షణ కోసం విద్యార్థి దశలోనే కరాటే నేర్చుకోవాలన్నారు.

వైభవంగా వసంత పంచమి వేడుకలు

జియాగూడ: జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో వసంత పంచమి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. స్కూల్ కార్యాలయంలో డైరెక్టర్ బాల్‌రాజ్ కొలే, ప్రిన్సిపాల్ సునేత్ర గణపతి పూజ, యజ్ఞ మహోత్సవం, నవగ్రహ పూజ, సరస్వతి మాతేశ్వరీ పూజలను నిర్వహించారు. బాల్‌రాజ్ కొలే మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా వసంత పంచమి రోజున సరస్వతి పూజలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం...

గోల్కొండ: షేక్‌పేట్‌లోని నాగార్జున హైస్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా సుమారు 80 మంది పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ భరత్‌కుమార్ వేదపండితులతో కలిసి చిన్నారులకు పలకా బలపంతో పాటు స్కూల్ యూనిఫామ్ ఉచితంగా అందజేశారు. ప్రిన్సిపాల్ భగవతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



షేక్‌పేట్‌లోని నాగార్జున హై స్కూల్‌లో..



సరస్వతీ విద్యా మందిర్‌లో..

మీరాలంమండిలో..

చార్మినార్: వసంత పంచమి వేడుకలు బుధవారం పాతబస్తీలో ఘనంగా జరిగాయి. వేడుకలను పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం అమ్మవారిని సరస్వతి దేవీగా అలంకరించారు. కృష్ణా జిల్లా గూడూరు మండలం కంకటావ గ్రామంలలోని స్వయంబు శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆధ్వర్యంలోని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొచ్చి సమర్పించారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో బెంగాలీల సరస్వతి పూజలు..

మీరాలంమండి బెంగాలీ అసోసియేషన్ మహిళా భక్తుల ఆధ్వర్యంలో బుధవారం సరస్వతి పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించే బెంగాలీలు బుధవారం సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి కలకత్తాకు చెందిన వేద పండితుడి మంత్రోచ్చరణల నడుమ మొదటి రోజు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. మూడు రోజుల అనంతరం ముగింపు పూజల సందర్భంగా ఈనెల 16న నిమజ్జనోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. నిమజ్జనోత్సవాల్లో భాగంగా సరస్వతి విగ్రహాన్ని చార్మినార్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు సామూహిక ఊరేగింపుగా తరలించనున్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: గౌలిపురా అయోధ్యనగర్‌లోని జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్‌లో బుధవారం వసంత పంచమి సందర్భంగా పాఠశాలలో సరస్వతీ దేవి పూజ, అక్షరాభ్యాసం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బండ్లగూడ ఉప విద్యాధికారి, రామ్ మోహన్, బహదూర్‌పురా ఉప విద్యాధికారి హరినారాయణ, తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆరుగురు నూతన విద్యార్థులతో అక్షరభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్లవర్స్ డే, వెజిటేబుల్ డే, ఫ్రూట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రావు, పాఠశాల కరస్పాంటిండెంట్ వి.రమేశ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, బీజేపీ నాయకులు సుధాకర్, ధీరజ్‌లాల్, రఘు పాల్గొన్నారు.

సరస్వతీ విద్యా మందిర్‌లో..

గౌలిపురాలోని సరస్వతీ విద్యా మందిర్‌లో బుధవారం వసంత పంచమి సందర్భంగా యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యజ్ఞంలో ప్రధానాచార్యులు దంపతులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు బాసర నుంచి తీసుకొచ్చిన కుంకుమను చిన్నారుల నుదిటపై పెట్టి దీవించారు.

ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో..

అబిడ్స్: రహింపురా ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. సరస్వతి మాతకు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షులు నగరి లక్ష్మీనారాయణ్, ప్రధాన కార్యదర్శి కాటిగర్ శంకర్, కోశాధికారి శివరతన్, బీఆర్ఎస్ నాయకులు హెచ్.కుమార్, ఎస్ఎస్‌కే స్కూల్ ప్రిన్సిపాల్ దాగుడు భవిత, ఎస్ఎస్‌కే మహిళా మండల్ అధ్యక్షులు రాజ్‌కుమార్ చౌహాన్, ఎస్.రాణి, విద్య, కల్పన తదితరులు పూజలు నిర్వహించారు.



జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో..



సరస్వతి దేవీ అలంకరణలో అమ్మవారు



కృష్ణా జిల్లా నుంచి వచ్చిన పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పిస్తున్న వేద పండితులు



పూజల్లో బెంగాలీ అసోసియేషన్ మహిళా ప్రతినిధులు



జ్ఞాన భారతి మోడల్ హై స్కూల్‌లో..



సరస్వతి మాతకు పూజలు చేస్తున్న దృశ్యం

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి



జియాగూడ: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ నగర నాయకులు జి.విఠల్ అన్నారు. బుధవారం కార్వాన్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో జియాగూడ మేకలమండిలో ఆటో డ్రైవర్స్‌కు కరపత్రాలను పంచి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ..16న దేశవ్యాప్త కార్మిక సమ్మె జయప్రదం చేయాలని ఆటో కార్మికులను కోరారు. రైతాంగ కార్మికవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదని ఆయన పేర్కొన్నారు. కమేళాను రక్షించడానికి సీఐటీయూ ఎప్పుడూ ముందుగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కన్వీనర్ కల్యాణ్, కో కన్వీనర్ చుక్క నర్సింహ, సీఐటీయూ నాయకులు డి.యాదయ్య, కమేళా ఆటో యూనియన్ కార్యదర్శి ఎస్.మల్లేష్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలపై మక్కువ పెంచాలి



గన్‌ఫౌండ్రీ: నేటితరం చిన్నారులకు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కల్పించాలని ప్రముఖ సినీ నటుడు బాబుమోహన్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో శ్రీ కళానిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నమయ్య పద సంకీర్తనలకు నృత్య నీరాజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్నమయ్య కీర్తనలు అమృత నీరాజనమని కొనియాడారు. శాస్త్రీయ కళలను కాపాడుకోవాలంటే నేటి యువతరానికి చిన్నప్పటి నుంచే నేర్పించాలని అందుకే తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీ నటుడు గౌతమ్‌రాజు, సీనియర్ జర్నలిస్టు ఎం.శ్రీనివాస్, ఓంశ్రీ చక్రల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వై.సంజీవ్ శర్మ, సంస్థ వ్యవస్థాపకురాలు లహరి ఘంటసాల తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య సంస్థ నాట్య తరంగం శిక్షణాలయం ఆధ్వర్యంలో నృత్య గురువు శుభా ధనుంజయ్ శిష్యురాలు సాయిశ్రేయ భరతనాట్య అరంగేట్రం బుధవారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పుష్పాంజలి, గణేష స్తుతి, మయూర అలరింపు, జతిస్వర, అమృతవర్షిణి, హంసనందిలతో పాటు పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆర్.చంద్రశేఖర్ మాట్లాడుతూ..ఉన్నత విద్యను అభ్యసిస్తూ శాస్త్రీయ కళల్లో ప్రావీణ్యం పొందడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నృత్య గురువు మద్దాలి ఉషా గాయత్రి, ప్రొఫెసర్ రమాదేవి, ఏనుగు సూర్యనారాయణ పాల్గొన్నారు.

అందరి విజ్ఞప్తి మేరకే ఎగ్జిబిషన్ పొడిగింపు



వనం సత్యేందర్

అబిడ్స్: ఎగ్జిబిషన్ (నుమాయిష్)ను మూడు రోజుల పాటు పొడిగించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్ పేర్కొన్నారు. స్టాల్ హోల్డర్లు, సందర్శకులు, అందరి విజ్ఞప్తి మేరకు ఈ నెల 15న ముగిసే ఎగ్జిబిషన్‌ను 18వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. మూడు రోజుల పాటు పొడిగింపు ద్వారా దాదాపు 2400 మంది స్టాల్ హోల్డర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎగ్జిబిషన్ మేనేజింగ్ కమిటీ మూడు రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడం ద్వారా స్టాల్ హోల్డర్లు, సందర్శకులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. అదే విధంగా 18వ తేదీ లోపు ఎగ్జిబిషన్ వ్యాలిడేటరి ఫంక్షన్‌ను నిర్వహిస్తామని వనం సత్యేందర్ తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలనుసారం త్వరలోనే వ్యాలిడేటరి ఫంక్షన్ తేదీ ప్రకటిస్తామన్నారు. ఎగ్జిబిషన్‌కు వస్తున్న లక్షలాది మంది సందర్శకుల కోసం ఎగ్జిబిషన్ సొసైటీ తరపున సకల ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు.

వేర్వేరు చోట్ల నలుగురి అదృశ్యం



నూరీ ఖానా



రమీజా బేగం



రోకుయా అలీ, సలేహీల్ అలీ

నాంపల్లి: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా జగిత్యాలకు చెందిన ఖాజా మజహరుద్దీన్, అదే ప్రాంతానికి చెందిన నూరీఖానా(44) ఇద్దరూ భార్యాభర్తలు. వీరికి ఇరువురు సంతానం. భర్త 8 నెలల క్రితం కేన్సర్‌తో చనిపోయారు. అప్పటి నుంచి ఆమె మానసిక స్థితి సరిగా లేకుండా పోయింది. అప్పటి నుంచి మాసబ్ ట్యాంక్ ఒవైసీపురా లక్ష్మీ నిలయం ప్లాట్ నెం –109లో ఉండే ఆమె సోదరుడు మహ్మద్ అజ్మత్ ఖాన్ దగ్గర ఉంటోంది. ఈనెల 5న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆమె మళ్లీ రాలేదు. ఆమె సోదరుడు మహ్మద్ అజ్మత్ ఖాన్ మాసబ్‌ట్యాంక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హబీబ్‌నగర్‌లో..

మల్లేపల్లి జాఫర్ గ్రౌండ్ సమీపంలో నివాసం ఉండే హలీమా, దివంగత షేక్ యూసుఫ్ కుమార్తె రమీజా బేగం(26) ఈనెల 13న స్నాక్స్ తీసుకుని వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి హలీమా హబీబ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యం

గౌలిపురా: తల్లీ కూతుళ్ల అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వి.దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన రోకుయా అలీ (28), అతావుల్లా ఖాన్ దంపతులు. వీరికి సలేహీల్ అలీ (5) సంతానం. కాగా రోకుయా అలీ కుటుంబ గొడవల కారణంగా భర్తతో దూరంగా ఉంటూ తల్లి గారింట్లో నివాసముంటుంది. బుధవారం మధ్యాహ్నం 3.15 గంటలకు రోకుయా స్కూల్‌లో ఉన్న కూతురు సలేహీల్ అలీని తీసుకొని కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన రోకుయా తండ్రి మక్సూద్ అలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

అబిడ్స్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా, నాయకులు శ్రీకాంత్, భాస్కర్ రావు, ప్రశాంత్, శ్రీహరి, రాములు, ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో..

గోల్కొండ: ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను కార్వాన్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చంటిబాబు, అఫ్సర్‌యూసుఫ్‌జాహీ, గోవర్ధన్ రెడ్డి, హబీబ్ తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా తదితరులు

సర్కిల్–12 డీఎంసీగా నాగేశ్వరరావు

నాంపల్లి: జీహెచ్‌ఎంసీ పరిధిలోని మెహిదీపట్నం సర్కిల్–12 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ (డీఎంసీ) బి.చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. రామగుండం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సీహెచ్.నాగేశ్వరరావు మెహిదీపట్నం సర్కిల్–12కు బదిలీ అయ్యారు. నవంబరులో జరిగిన విధాన సభ ఎన్నికల బదిలీల్లో మెహిదీపట్నం సర్కిల్–12కు ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు డీఎంసీగా పనిచేయలేకపోయారు. అనారోగ్యం కారణంగా సెలవు పెట్టడంతో ఆంజనేయులు స్థానంలో బి.చంద్రశేఖర్ ఇన్‌చార్జి డీఎంసీగా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన మూడు నెలలు కూడా ముగియక ముందే మళ్లీ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో మీర్‌పేటకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో నియమితులైన రామగుండం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

గృహజ్యోతిపై అవగాహన



గోల్కొండ: గృహజ్యోతి వల్ల నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఎంతో మేలు చేకూరుతుందని నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. బుధవారం నానల్‌నగర్ డివిజన్ మేరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మజ్లిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గృహజ్యోతి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గృహజ్యోతి పథకంపై మరిన్ని వివరాలు తెలుసుకోవాలనుకునే వారు ఈ అవగాహన కార్యక్రమాన్ని వచ్చి తెలుసుకోవచ్చునన్నారు. విద్యుత్ శాఖకు చెందిన వారు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తారన్నారు. అర్హులైన వారిని గుర్తించి వారి వివరాలను పై అధికారులకు అందిస్తారన్నారు.

ఆర్ట్ గ్యాలరీ పనులను అడ్డుకున్న విద్యార్థులు

నాంపల్లి: జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అధికారులకు వర్సిటీ ప్రాంగణంలోని క్యాంటీన్ కామధేనువుగా మారిందని విద్యార్థులు ఆరోపించారు. క్యాంటీన్‌లో ఆర్ట్ గ్యాలరీని నిర్మించొద్దని నినాదాలు చేపట్టారు. క్యాంటీన్ నిర్వహణను గాలికి వదిలేసిన వర్సిటీ అధికారులు ప్రస్తుతం క్యాంటీన్ స్థానంలో ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే గడచిన రెండు రోజులుగా క్యాంటీన్ పైఅంతస్తులో మరమ్మతులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీలోని క్యాంటీన్‌లో ఆర్ట్ గ్యాలరీ నిర్మిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయమై వర్సిటీ ఉపాధ్యక్షురాలు కవితా ధర్యాణిరావును వివరణ కోరగా అలాంటిదేమి లేదని సమాధానాన్ని దాటవేశారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు



వేడుకల్లో మదిర సత్యనారాయణ, బాబు, మహిళలు

జియాగూడ: ఇమాంపురాలో బొడ్రాయి నాభిశిల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించామని ఇమాంపురా నవ భారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. బుధవారం ఇమాంపురా చౌరస్తాలో బొడ్రాయి నాభిశిల వేడుకలను చేపట్టారు. ముందుగా వేద పండితుల పూజా కార్యక్రమం, బొడ్రాయి యంత్ర ప్రతిష్ఠాపన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, వాటర్‌వర్క్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వై.యాదయ్య, డి.సంతోష్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, వినయ్‌కుమార్, మహేష్‌బాబు, జస్వంత్‌కుమార్, శివకుమార్, సి.సత్యనారాయణ, పి.నర్సింగ్‌రావు, ఎస్.జగదీష్, ఎ.గౌతమ్, అర్జున్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణకు స్థానికులు, పీస్ అండ్ మైత్రి కమిటీ సహకారం అవసరమని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. బుధవారం స్థానిక నాయకులు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోల్కొండ ఎంతో సున్నితమైన ప్రాంతమని..ఇక్కడ జరిగే అన్ని వర్గాల ప్రజల పండుగలలో ఒకరికొకరు సహకరించుకుంటూ పండుగలను, స్థానిక ఉత్సవాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించుకుంటారన్నారు. పీస్ అండ్ మైత్రి కమిటీలలో యువకులు, మహిళల సంఖ్య పెరుగుతూ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఆబేద్, అక్బర్, ఖైరుద్దీన్ తదితరులున్నారు.


'కేసీఆర్‌ను ప్రజలు ఛీకొట్టినా మార్పు రావడం లేదు'



గౌరీ సతీష్

అబిడ్స్: మాజీ సీఎం కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు ఛీకొట్టినప్పటికీ ఆయనలో కానీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుల్లో కానీ మార్పు రావడం లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. పదేళ్ల పాటు తెలంగాణ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను నట్టేట ముంచిన కేసీఆర్ అండ్ టీమ్‌ను ప్రజలు ఇంటికి సాగనంపినా వారిలో ఇంకా అహంకారం తగ్గడం లేదన్నారు. బుధవారం తన కార్యాలయంలో గౌరీ సతీష్ విలేకర్లతో మాట్లాడుతూ.. కేసీఆర్‌తో పాటు, కేటీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఇతర పలు రాష్ట్ర నాయకులు దిగజారుడుగా, తెలంగాణ సభ్య సమా జాన్ని కించపరిచే విధంగా మాట్లాడుతుండడం ఎంతో శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అండగా ఉండి వారి సంక్షేమానికి, అభివృద్ధికి, రాష్ట్ర ప్రగతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



సుల్తాన్‌బజార్: పుల్వామ ఘటనలో అమరులైన వీర జవాన్లకు బజరంగ్ దళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తాలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వాలెంటైన్ డేను నిషేధించాలని వారు కోరారు.